సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం : 22 : జూలై : 2025



లారీ ఢీకొని మహిళ మృతి

వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లిన మహిళ ఆస్పత్రికి చేరకుండానే మృతి చెందిన సంఘటన ముసునూరు మండలంలో జరిగింది.

10లో ▸



వరిని ముంచిన వరుణుడు

రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆచంట నియోజకవర్గంలో నారుమడులు, వరినాట్లు నీటమునిగాయి.

10లో ▸



సింగవరంలో తాగునీటి కష్టాలు

దెందులూరు మండలం సీతంపేట పంచాయతీ సింగవరంలో తాగునీటి కష్టాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

10లో ▸

న్యూస్‌రీల్

చట్ట పరిధిలో పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజాసమస్యలపై త్వరితగతిన స్పందించి, నిర్ణీత గడువులోపు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్నారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త, అత్తింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఆస్తి తగాదాలు వంటి సమస్యలపై 10 అర్జీలు స్వీకరించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేవీఎస్ గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కొబ్బరి వర్తకుల భవనంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు అదానీ మెప్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తెచ్చిందన్నారు. వీటి వల్ల బిల్లులు 2, 3 రెట్లు పెరగడమే కాకుండా, టైం ఆఫ్ స్కేల్ ద్వారా ప్రజలపై భారం పడుతుందన్నారు. ముందస్తుగా బిల్లు కట్టి కరెంట్ కొనుక్కోవడం వల్ల ప్రజలు ఆర్థిక కష్టాలు అనుభవించాల్సి వస్తుందన్నారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు పగలు కొట్టండని పిలుపునిచ్చిన లోకేష్ అధికారం చేపట్టిన తర్వాత బిగించడని చెప్పడం ఏరు దాటిన తరువాత తెప్ప తగలెయడమేనని విమర్శించారు.

ఎకరాకు 56 కిలోల ఎరువులు అవసరం

తాడేపల్లిగూడెం: ఉభయగోదావరి జిల్లాల్లో వ్యవసాయంలో అధికంగా ఎరువులు వినియోగిస్తుంటారని, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు వెళితే ఇంత పెద్ద మొత్తంలో ఎరువులు వాడక్కరలేదని వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. వరిలో అత్యధికంగా రసాయన ఎరువులు వినియోగించే జిల్లాలు ఉభయగోదావరి జిల్లాలే అన్నారు. గోదావరి జిల్లాల్లో 164 కిలోలు వాడుతున్నారని, అయితే ఎకరాకు కావాల్సింది కేవలం 56 కిలోల ఎరువులు మాత్రమే అన్నారు. సేంద్రియ పద్ధతిలో వరికి అవసరమైన వాటిని వాడాలన్నారు. డ్రోన్ ద్వారా జీవామృతం పిచికారీపై వివరించారు. ప్రకాశరావుపాలెం, చోడవరం రైతులకు అవగాహన కల్పించారు.

టీడీపీ కార్యకర్తల దాడి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: దెందులూరు వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర తండ్రి బసవ పున్నయ్యపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దాడి చేసి పామాయిల్ గెలలను అపహరించడం ఘర్షణకు దారి తీసింది. సోమవారం కొప్పులవారిగూడెంలో తన పొలంలో పామాయిల్ గెలలను కోసుకుని ఫ్యాక్టరీకి తీసుకువెళుతుండగా టీడీపీ కార్యకర్తలు అడ్డగించి కళ్లల్లో కారం కొట్టి ఐదు టన్నుల లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను తీసుకువెళ్లారని బాధితుడు బసవ పున్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో తమ కుటుంబాన్ని అన్నిరకాలుగా నష్టపరుస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని వాపోయారు. దాడిని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్రంగా ఖండించారు. బసవ పున్నయ్య కుటుంబానికి అండగా ఉంటామన్నారు. జరిగిన సంఘటనపై మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి జిల్లా ఎస్పీ ప్రతాప శివకిషోర్, అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావులతో ఫోన్‌లో మాట్లాడారు.


మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగింపు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో దాటవేత ధోరణి అవలంబించడంపై ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జీతాలు మొక్కుబడిగా పెంచడం గర్హనీయమని విమర్శించారు. కార్మికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం కోసం మంగళవారం కూడా సమ్మెను కొనసాగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు.

కొందరికే వందనం

తల్లులకు ఎగనామం

- పూర్తిస్థాయిలో అర్హులకు అందని తల్లికి వందనం లబ్ధి
- ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో అర్హులైన విద్యార్థులు 2,29,106 మంది
- మొదటి విడతలో 1,76,574 మంది, గ్రీవెన్స్‌లో 11,416 మందికి జమ
- మిగిలిన వారి పరిస్థితి అగమ్యగోచరం
- విద్యుత్ బిల్లులు, ఫోర్ వీలర్ల పేరిట తాత్సారం



సాక్షి, భీమవరం: తల్లికి వందనం పథకం అమలులో కూటమి ప్రభుత్వం పిల్లి మొగ్గలు వేస్తోంది. అర్హులైన వారందరికీ పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పి వివిధ సాకులు పేరిట కొందరికి ఎగనామం పెడుతోంది. అర్హులుగా గుర్తించిన వారికి సైతం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో లబ్ధి చేకూర్చకపోవడం గమనార్హం.

1,920 పాఠశాలలు.. 2.79 లక్షల మంది విద్యార్థులు

జిల్లాలో 1,920 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లోని విద్యార్థులు 2,79,204 మంది వరకు ఉండగా, 121 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులు 37,124 మంది ఉన్నారు. 1వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు మొత్తం 3,16,328 మంది ఉన్నారు. వీరిలో 2,29,106 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. మండలాలతో పోలిస్తే విద్యాసంస్థలు ఎక్కువగా ఉన్న పట్టణ ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారి ఒక్కో విద్యార్థికి రూ.15,000 చొప్పున రూ. 343.81 కోట్లను వారి తల్లుల ఖాతాలకు జమచేయాల్సి ఉంది. పాఠశాలల నిర్వహణ పేరిట రూ. 2,000 తగ్గించి గత నెల 12న మొదటి విడతగా జిల్లాలోని 1,76,574 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లుల ఖాతాలకు రూ.229.55 కోట్లను జమచేసింది.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలంటూ..

10వ తరగతి పూర్తయి ఇంటర్‌లో చేరిన విద్యార్థులకు తర్వాత అందజేస్తామని, సాంకేతిక పరమైన అవరోధాలతో ఆగిన వారు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ మేరకు 20,139 మంది నుంచి వినతులు వచ్చాయి. ఇటీవల వీటిలోని 11,416 మందికి తల్లికి వందన సాయాన్ని, 1,137 మందికి సాయం అందించాల్సి ఉందని, 4262 మంది దరఖాస్తులు ఇంకా పరిశీలనలో ఉన్నట్టుగా అధికారులు చెబుతున్నారు. కాగా ఫోర్ వీలర్, స్థలం, ఇన్‌కంటాక్స్, ప్రభుత్వ ఉద్యోగి, విద్యుత్ బిల్లులు తదితర వాటిని సాకుగా చూపించి 4,693 మంది దరఖాస్తులను పక్కన పెట్టేసినట్టు తెలుస్తోంది.

మొత్తంగా ఇప్పటివరకు దాదాపు 1,87,990 మందికి సాయం అందించగా మిగిలిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. తమకు సొంత ఇళ్లు కూడా లేకపోయినా తమ పేరిట స్థలాలు ఉన్నాయని, విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని తదితర రకరకాల సాకులతో సాయం విడుదల చేయకుండా తాత్సారం చేస్తున్నారని అర్హులైన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇప్పటివరకు ఎంతమందికి సాయం అందిందనే విషయంపై తమ వద్ద స్పష్టమైన సమాచారం లేదని ఉద్యోగ వర్గాలంటున్నాయి.

మండలాల వారీగా అర్హులు

మండలం	అర్హులు	మండలం	అర్హులు	మండలం	అర్హులు
		ఇరగవరం	4,211	పెనుగొండ	11,039
ఆచంట	5,354	కాళ్ల	6,780	పెనుమంట్ర	5,697
ఆకివీడు	9,610	మొగల్తూరు	7,657	పోడూరు	5,242
అత్తిలి	6,196	నరసాపురం	20,193	తాడేపల్లిగూడెం	25,881
భీమవరం	33,928	పాలకొల్లు	21,267	తణుకు	27,775
యలమంచిలి	5,286	పాలకోడేరు	5,410	ఉండి	6,413
గణపవరం	7,406	పెంటపాడు	7,302	వీరవాసరం	6,459

కొందరికి అరకొరగానే..

Monday, Jun 23 • 5:31 PM

ప్రియమైన Kondeti Mariyamma,
తల్లి కి వందనం పథకం లో భాగంగా,
రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.8850 మీ
బ్యాంక్ ఖాతాలో జమ చేయబడింది.
కేంద్ర ప్రభుత్వం వాటా త్వరలో జమ
చేయబడుతుంది. బ్యాంక్ పేరు:
India Post Payments Bank
ఖాతా సంఖ్య: XXXXXX9754
గ్రాము/వార్డు సచివాలయ
శాఖ,GOVTAP

రూ.8,850 మాత్రమే జమైన కుముదవల్లిలోని లబ్ధిదారురాలి సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్

ఒక్కో విద్యార్థికి రూ.13 వేలకు గాను కొంతమంది తల్లులకు రూ.8,500 నుంచి రూ.9,000 మాత్రమే జమయ్యాయి. తల్లికి వందనం పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ వాటా మీ అకౌంట్‌కు జమచేయడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వ వాటా త్వరలో జమచేయబడుతుందంటూ తక్కువ మొత్తం జమైన లబ్ధిదారుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు రావడం గమనార్హం. దాదాపు నెలరోజులు కావస్తున్నా కేంద్రం వాటా రాకపోవడంతో వస్తుందో? లేదోనని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎప్పుడు ఇటువంటి పరిస్థితి లేదని, అందరికీ ఒకేసారి ఇచ్చేవారని చెబుతున్నారు.

సెంటు భూమి లేకున్నా 46 ఎకరాలు చూపిస్తూ..

'తల్లికి వందనం ఇవ్వకపోయినా పర్వాలేదు సార్. నా పేరిట ప్రభుత్వ రికార్డుల్లో చూపిస్తున్న 46 ఎకరాల భూమిలో పై ఆరు ఎకరాలు తమకు అప్పగిస్తే చాలు' అంటున్నాడు వీరవాసరం మండలం రాయకుదురుకు చెందిన తోట పెద్దిరాజు. తాను వ్యవసాయ పనులు చేస్తుంటానని, తమ ఇద్దరు కుమార్తెలు రాయకుదురు జెడ్పీ హైస్కూల్‌లో చదువుకుంటున్నారన్నారు. సెంటు భూమి కూడా లేని తనకు రాయకుదురు, కొణితివాడ గ్రామాల్లో ఏకంగా 46 ఎకరాల భూమి ఉన్నట్టు రికార్డులో ఉండటంతో మొదటి విడతలో తల్లికి వందనం సాయం అందలేదన్నారు. సచివాలయ సిబ్బంది సూచన మేరకు రెండు గ్రామాల్లోనూ తన పేరిట భూమి ఏమీ లేదని వీఆర్వోల స్టేట్‌మెంట్ తీసుకుని గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపాడు. అయినా ఒక్క రూపాయి సాయం కూడా రాలేదని చెబుతున్నాడు. తనదిగా చూపిస్తున్న 46 ఎకరాల భూమిలో 40 ఎకరాలు తీసేసుకుని ఆరు ఎకరాలు స్వాధీనం చేస్తే ఎంతో సంతోషిస్తానంటూ ప్రభుత్వంపై తనదైన శైలిలో అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఆయన ఒక్కరే కాదు అర్హత ఉన్నా తల్లికి వందనం అందని ఎంతో మంది ఆవేదన ఇది.



తోట పెద్దిరాజు

అక్రమ కేసులతో భయపెట్టలేరు



భీమవరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడు

వీరవాసరం: ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా కేసు నుంచి బయటకు వస్తారని వైఎస్సార్‌సీపీ భీమవరం ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడు అన్నారు. భీమవరంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చి గద్దెనెక్కిన తర్వాత వాటిని తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని విమర్శించారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు బెయిల్‌పై ఉన్నారనే విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులను హింసించాలి, భయపెట్టాలి అనే ప్రభుత్వ ఆలోచన ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ పూర్తి పారదర్శకతతో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లిక్కర్ పాలసీని అపహాస్యం చేసేలా ప్రస్తుత ప్రభుత్వం నడుచుకుంటుందన్నారు. ఎటువంటి అవినీతి, అక్రమాలకు చోటులేకుండా గతంలో లిక్కర్ పాలసీ అమలు చేశారన్నారు. కావాలనే వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి మరీ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎవరు ఎన్ని అక్రమ కేసులు బనాయించినా ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. నాయకులు ఏఎస్ రాజు, జి.రామరాజు, చవాకుల సత్యనారాయణమూర్తి, జల్లా కొండయ్య, మానుకొండ ప్రదీప్ కుమార్, పెనుమాల నరసింహస్వామి, వీరవల్లి శ్రీనివాస్, ఎరకరాజు ఉమాశంకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ పిల్లల బాధ్యత

కలెక్టర్ నాగరాణి



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): వృద్ధులైన తల్లిదండ్రులను ఇబ్బంది పెడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని కలెక్టర్ సీహెచ్ నాగరాణి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో భాగంగా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 260 అర్జీలు స్వీకరించారు.

వృద్ధురాలికి భరోసా : నరసాపురం ఎన్టీఆర్ కాలనీకి చెందిన వృద్ధురాలు బండి వెంకట నరసమ్మ (90) తనకు ముగ్గురు కుమారులని, ఒక కుమారుడు తన స్థలంలో ఇల్లు నిర్మించుకుని, తనను చూడటం లేదంటూ కలెక్టర్‌ను ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. ఎవరి సాయం లేకుండా వచ్చిన నరసనమ్మ వద్దకు కలెక్టర్ వెళ్లి ఆమె సమస్య తెలుసుకుని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్తులు రాయించుకుని వృద్ధులను బయటికి పంపిస్తే, రాసిన ఆస్తులు చెల్లవని వృద్ధులు వాటిని తిరిగి పొందే హక్కు ఉందన్నారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో చూడాల్సిన బాధ్యత పిల్లలదే అన్నారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

ఎస్సీ పేటలో పాఠశాలను కొనసాగించాలి

పెనుమంట్రలో గత ప్రభుత్వంలో నాడు–నేడులో అభివృద్ధి చేసిన ఎస్సీ పేటలోని ప్రాథమిక పాఠశాలను అనుసంధానం పేరుతో పాడైన మరో స్కూల్‌లోకి మార్చేందుకు దొంగచాటుగా తీర్మానం చేశారంటూ పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఓ విద్యార్థి తల్లి బొడ్డుపల్లి సత్యవతి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో 35 మంది పిల్లలు ఉన్నారని, వీరంతా మరోచోట ఏర్పాటుచేసిన స్కూల్‌కు వెళ్లకుండా ఎస్సీ పేటలోని పాఠశాలలో ఉన్నారని, వీరికి మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు, ఉపాధ్యాయులు రావడం లేదన్నారు. స్కూల్‌ను యథాతథంగా ఉంచాలని ధర్నాలు, దీక్షలు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

భీమవరం (ప్రకాశంచౌక్): జనవరి 1, 2026 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలని కలెక్టర్ నాగరాణి తెలిపారు. సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మృతి చెందిన వ్యక్తులు, వలస వెళ్లిన వారు, ఒకే వ్యక్తి రెండు సార్లు నమోదై ఉంటే ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తామన్నారు.

ఫేస్ యాప్‌పై అంగన్‌వాడీల గళం



పెంటపాడు: ప్రత్తిపాడులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



పెనుమంట్ర: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద వినతిపత్రం అందిస్తూ..

పెంటపాడు: అంగన్‌వాడీ పథకంలో టీచర్లకు, లబ్ధిదారులకు ఆటకంగా ఉన్న ఫేస్ రికగ్నైజ్‌డ్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్)ను కూటమి ప్రభుత్వం తక్షణం రద్దుచేయాలని కోరుతూ అంగన్‌వాడీలు, గర్భిణులు, బాలింతలు చిన్నారులలో కలిసి సోమవారం నిరసన చేపట్టారు. ప్రత్తిపాడులో ధర్నాకు దిగారు. ఐసీడీఎస్ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు జె.శ్యామల, జి.దీనాలు మాట్లాడుతూ పోషణ కిట్‌ల పంపిణీకి ఓటీపీ ద్వారా కేవైసీ నిబంధన సరికాదన్నారు. కొన్నిచోట్ల సిగ్నల్ సమస్యతో సరుకుల పంపిణీలో ఇబ్బంది పడుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు గ్గిపోయే ప్రమాదముందని, యాప్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ సరుకులు పొందడానికి ఆంటకాలా అంటూ పెనుమంట్ర ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేసి వినతిపత్రం అందించారు. ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, ఆన్‌లైన్ పద్ధతిని రద్దు చేయాలని, తేలికగా లబ్ధిదారులు సరుకులు పొందడానికి అవకాశం కల్పించాలని నినాదాలు చేశారు. సీఐటీయూ మండల నాయకుడు కోడి శ్రీనివాసప్రసాద్ మద్దతు తెలిపారు. జిల్లా నాయకురాలు కానూరు తులసి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు లేరు.. పని చేసేదెవరు?

- జిల్లా పరిషత్‌లో 662 పోస్టుల ఖాళీ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కుంటుపడిన పాలన
- కీలకమైన అకౌంట్స్ అధికారి పోస్టుదీ అదే పరిస్థితి
- 13 మండలాల్లో ఇన్‌చార్జి ఎంపీడీఓలే..
- పట్టించుకోని కూటమి సర్కారు



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ కార్యాలయం

ఏలూరు (మెట్రో): 'అధికారంలోకి వచ్చిన తరువాత ఏటా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టి నిరుద్యోగ వ్యవస్థను రూపుమాపుతాం' ఇవీ గతేడాది ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు పలికిన ప్రగల్భాలు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టే పనిలో నిమగ్నమైంది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఒక్క కొత్త ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదు. జిల్లాలో ప్రజలకు సుపరిపాలన అందాలన్నా.. సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో చేరువ కావాలన్నా జిల్లా పరిషత్ వ్యవస్థ ఎంతో కీలకం. అటు రాజకీయంగా, ఇటు పరిపాలన పరంగా పెనవేసుకుని ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌లో కీలకమైన ఉద్యోగాలన్నీ ఇన్‌చార్జిలతోనే కొనసాగుతున్నాయి. జిల్లా పరిషత్‌లోకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎంపీపీ కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాలు, ఇంజనీరింగ్ సెక్షన్‌లు ప్రజలకు సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంటాయి. అయినప్పటికీ జిల్లా పరిషత్‌లో వందలాది ఉద్యోగాలు భర్తీకి నోచుకోవడం లేదు. ఏళ్ల తరబడి ఖాళీగానే ఉంటున్నాయి. జిల్లా పరిషత్ వ్యవస్థలో ఏలూరులోని జెడ్పీ కార్యాలయంతో పాటు 15 విభాగాల్లో ఉద్యోగాలను భర్తీ చేయాల్సి ఉంది. దీనిలో జిల్లా పరిషత్ కార్యాలయంలోని సీఈఓ, డిప్యూటీ సీఈఓ ఉద్యోగాలు మినహా మిగిలిన అన్ని విభాగాల్లోనూ కీలకమైన పోస్టులను ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు.

అకౌంట్స్ అధికారి కీలకం

ఉమ్మడి జిల్లాకు కీలకమైన అకౌంట్స్ అధికారి పోస్టు ఒక్కటే ఉంది. అయితే అదీ ఖాళీగా ఉంది. జిల్లా పరిషత్‌లోని అన్ని విభాగాలకు ఈ అధికారి ద్వారానే నిధులు బదిలీ అవుతాయి. ప్రతి రూపాయి విడుదల, ఖర్చుకు అకౌంట్స్ అధికారి కీలకంగా వ్యవహరిస్తారు. అయితే ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో నిధుల ఖర్చు ఇష్టారాజ్యంగా సాగుతోంది. ఈ పోస్టు భర్తీపై పాలకులు దృష్టి సారించడం లేదు.

35 మంది ఎంపీడీఓలే..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 48 మండలాల్లో అభివృద్ధి పనులకు ఎంపీడీఓలు కీలకం. అయితే 35 మండలాల్లోనే పూరిస్థాయిలో ఎంపీడీఓలు ఉండగా.. 13 మండలాల్లో లేరు. దీంతో 13 మండలాల్లో ఇన్‌చార్జుల పాలనలో నెట్టుకొస్తున్నారు.

1,600 పోస్టులు.. 662 ఖాళీలు

పశ్చిమగోదావరి జిల్లాపరిషత్‌లో మొత్తం 1,600 పోస్టులకు గాను 938 పోస్టుల్లో మాత్రమే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన 662 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్ని పోస్టులు ఖాళీగా ఉంటే ప్రజలకు ఎంతవరకూ సేవలందుతాయనే విషయాన్ని పాలకులు గుర్తించాలి. త్వరితగతిన పోస్టుల భర్తీ చేయాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది.

ఉద్యోగుల ఖాళీలు భారీగానే..

సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ల పరిస్థితి కూడా అలానే ఉంది. రికార్డు అసిస్టెంట్లు 18 పోస్టులు, లైబ్రరీ అసిస్టెంట్లు 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆఫీస్ సబార్డినేట్లు 484 పోస్టులకు 65 మంది మాత్రమే పనిచేస్తుండగా 418 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక క్లాస్–4 ఉద్యోగులు 185 పోస్టులకు 8 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. క్లాస్–4 ఉద్యోగుల పోస్టులు 177 ఖాళీగా ఉన్నాయి.

త్వరలో సమీక్షిస్తా..



జిల్లా పరిషత్‌లో ఖాళీల భర్తీపై త్వరలో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం. నూతనంగా నేను బాధ్యతలు తీసుకున్నాను. పరిపాలనకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తాం. సమీక్షా సమావేశం ద్వారా తగు నిర్ణయం తీసుకుంటాం.

– ఎం.శ్రీహరి, జెడ్పీ సీఈఓ

వంతెన.. ప్రమాదం అంచున



చెరుకువాడలో ఉండి కాలువపై కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

ఉండి మండలంలోని చెరుకువాడలో ఉండి కాలువపై వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో సుమారు వెయ్యి ఎకరాల వరి, ఆక్వా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జాతీయ రహదారి-165ను ఆనుకుని చెరుకువాడలో కాపులపేట వద్ద 80 ఏళ్ల క్రితం దీనిని నిర్మించారు. చెరుకువాడతో పాటు కాళ్ల మండలం కోలనపల్లికి చెందిన వరి చేలు, ఆక్వా చెరువులకు రాకపోకలకు ఇదే ఆధారం. వంతెన నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. - ఉండి

క్లుప్తంగా

షార్ట్ ఫిల్మ్ పోటీల్లో అవార్డు



ఉత్తమ షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ అవార్డు అందుకుంటున్న వంశీకృష్ణంరాజు

కాళ్ల: షార్ట్ ఫిల్మ్ ఉత్తమ డైరెక్టర్ అవార్డును కాళ్ల మండలం కోపల్లె వాసి ఇందుకూరి వంశీకృష్ణంరాజు దక్కించుకున్నారు. ఈనెల 20న కోల్‌కతాలో జరిగిన 14వ అంతర్జాతీయ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నట్లు సోమవారం ఆయన కుటుంబీకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 1000 మంది పాల్గొన్న ఈ పోటీల్లో వంశీకృష్ణంరాజు దర్శకత్వం చేసిన 'పర్వసం' అనే షార్ట్ ఫిల్మ్ మొదటి స్థానంలో నిలిచి 'ఉత్తమ దర్శకుడు – జ్యూరీ' అవార్డును అందుకున్నారని తెలిపారు. వంశీకృష్ణంరాజు ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



తణుకులో బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్ : ఈ నెల 18 నుంచి 20 వరకు తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన పశ్చిమ గోదావరి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. చిట్టూరి సుబ్బారావు, సత్య ఉషారాణి ఇండోర్ స్టేడియంలో వివిధ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన చిట్టూరి రీనా సాయి మాట్లాడుతూ బ్యాడ్మింటన్‌లో క్రీడాకారుల ప్రతిభ ఎనలేనిదన్నారు. క్రీడాకారులంతా ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌కు స్పాన్సర్ చేసిన ఎస్‌కేఎస్‌డీ గ్రూప్ ఆఫ్ కాలేజీల యాజమాన్యాన్ని అసోసియేషన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి మెంటే వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడు కంటిపూడి రాంబాబు, సహాయ కార్యదర్శి జవ్వాది కిషోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సమ్మెట్ల సతీష్‌బాబు, ఉపాధ్యక్షుడు ఇందుకూరి కిషోర్‌లు విజేతలకు బహుమతులు అందచేశారు.

చెస్ పోటీల్లో ప్రతిభ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక జీవీఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఏపీ స్టేట్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నీలో విజేతలకు సోమవారం బహుమతులు అందించారు. ఈ పోటీల్లో చొప్పా వీర వెంకట వివేక్ (ఏలూరు) ప్రథమ స్థానం, ఎ.రామకృష్ణ (ఎన్టీఆర్ జిల్లా) ద్వితీయ స్థానం, సాధనాల సంతోష్ (కోనసీమ జిల్లా) తృతీయ స్థానం, బండారు నాని బాబు (కోనసీమ) నాలుగో స్థానంలో, పనిశెట్టి ధరణి (కోనసీమ) ఐదో స్థానంలో నిలిచినట్టు నిర్వాహకులు తెలిపారు.

ఊరించి ఉసూరుమనిపించారు

ఉపకరణాలని చెప్పి దరఖాస్తులతో సరిపెట్టిన వైనం



దరఖాస్తులు ఇవ్వడానికి వేచి ఉన్న దివ్యాంగులు

పాలకొల్లు సెంట్రల్: వివిధ ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఉపకరణాల కోసం దరఖాస్తులు ఇవ్వడానికి ఆదివారం పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో ఎంపిక శిబిరం ఏర్పాటుచేశారు. తమకు పరికరాలు ఇస్తామని చెప్పి సమావేశానికి తీసుకువచ్చారని కొందరు దివ్యాంగులు ఆవేదన వ్యక్తంచేశారు. తీరా సమావేశానికి వచ్చాక ఎంపిక చేస్తామని సమాధానం చెప్పారని వాపోయారు. ఇంటికి తీసుకువెళ్లి దరఖాస్తులు ఇవ్వకుండా సాయంత్రం వరకూ వారిని కూర్చోపెట్టాల్సిన అవసరం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు తరువాత ఐడీ కార్డుల కోసం సాయంత్రం వరకూ దివ్యాంగులు, వృద్ధులు కార్యాలయంలోనే ఉండిపోయారు. ఉపకరణాలు ఇచ్చేటప్పుడు వారిని పిలిచి ఇస్తే సరిపోతుందని, సాయంత్రం వరకూ కూర్చోపెట్టి దరఖాస్తులు తీసుకుని పంపడం ఎందుకుని పలువురు ప్రశ్నిస్తున్నారు.విభిన్న ప్రతిభావంతుడు ఒక శిబిరానికి వచ్చి సాయంత్రం వరకూ ఉండాలంటే ఎంతో కష్టం. వారి కూడా మరొకరు రావాల్సి ఉంటుంది. ఉపకరణాలు అందించేటప్పుడు సమావేశం ఏర్పాటుచేసి ఉంటే బాగుండేది కదా అని విమర్శలు వినిపించాయి. ప్రస్తుతం సదరన్ సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ జరుగుతుందని.. అదులో సెలెక్ట్ అయినవారికి వారి పర్శంటేజ్ బట్టి అక్కడే ఎవరికి ఏ పరికరం అవసరమో నమోదు చేస్తే సరిపోయేది కదా? కొందరు ప్రశ్నించారు. నియోజకవర్గంలో కొందరు పాలకొల్లు, తణుకు, భీమవరం , నరసాపురం, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, కాకినాడ ఇలా ఒక్కో ప్రాంతంలో రీ వెరిఫికేషన్ చేయించుకోవడానికి అవకాశం కల్పించారు. అంత దూరం వెళ్లి సర్టిఫికెట్‌లు చేయించుకున్న తమను మళ్లీ ఇక్కడకు రప్పించి ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకూ సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం వచ్చిన దివ్యాంగుల్లో కొందరికి ఎండ వేడికి వాంతులయ్యాయి. దివ్యాంగులు టాయిలెట్లకు వెళ్లడానికి వెసులుబాటు లేకుండా పోయింది.

'ఆది కర్మయోగి' అమలుపై సమీక్ష



కర్మయోగి కార్యక్రమంపై సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): గిరిజనుల అభివృద్ధి కోసం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర గిరిజన సంక్షేమ వ్యవహారాల శాఖ కార్యదర్శి వివిధ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఆది కర్మయోగి కార్యక్రమం అమలుపై సోమవారం సాయంత్రం ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కె.వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని, వాటి ఫలితాలు మారుమూల గిరిజన ప్రాంతాలకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గిరిజనుల సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అందించేందుకు ఆది కర్మయోగి కార్యక్రమం ద్వారా గిరిజన సంక్షేమ పథకాల అమలులో అధికారుల సామర్థ్యాన్ని పెంచడం, వారిని మరింత ప్రభావవంతంగా పనిచేయడానికి ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఆది కర్మయోగి కార్యక్రమం కింద ప్రభుత్వ అధికారులకు గిరిజన సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ అందిస్తున్నామన్నారు.శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు గిరిజన సంక్షేమ శాఖలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాములు నాయక్, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సింగవరంలో తాగునీటి కష్టాలు



రంగుమారిన తాగునీటిని చూపిస్తున్న మహిళలు



బోర్డుపై నమోదు చేయని క్లీనింగ్, బ్లీచింగ్ తేదీలు

దెందులూరు: సీతంపేట పంచాయితీ శింగవరంలో తాగునీటి కష్టాలు శాశ్వతంగా తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. గోదావరి కాల్వ నుంచి ఫిల్టర్ చేయకుండా పంపుల ద్వారా సరఫరా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ నిబంధనల ప్రకారం రక్షిత మంచినీటి పథకాల్లో తాగునీటిని బ్లీచింగ్ చేసి, ట్యాంక్ క్లీనింగ్ చేయాలి. ఈ రెండు పనులను ట్యాంక్ బోర్డు మీద విధిగా నమోదుచేయాలి. ఈ రెండు పనులు చేయడం లేదు. రంగు మారిన ఫిల్టర్ చేయని నీరు ఎలా తాగాలని.. మాకు మాత్రమే ఎందుకిలా సరఫరా చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. తాగునీటికి సంబంధించి కలెక్టర్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇస్తున్నప్పటికీ తమ ప్రాంతంలో మాత్రమే తాగునీరు సక్రమంగా లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ఇక్కట్లుపై ఆర్‌డబ్ల్యూఎస్ దెందులూరు మండల ఏఈ వర్మను వివరణ కోరగా సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు.



ములపర్రులో గోదావరిని తలపిస్తున్న వరిచేలు



సిద్ధాంతంలో నీట మునిగిన వరి నాట్లు

వరిని ముంచిన వరుణుడు

పెనుగొండ: అనావృష్టి.. అతి వృష్టితో వరి రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. నిన్న మొన్నటి వరకు నీరందక నారుమళ్లు ఎండితే.. రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నారుమళ్లు, వరినాట్లు నీటమునిగాయి. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ, ఆచంట మండలాల్లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరి చేలు చెరువులను తలపిస్తున్నాయి. ఇంకా వరి నాట్లు వేయని నడిపూడి, చినమల్లం, తామరాడ, కొఠాలపర్రు వంటి ప్రాంతాల్లో వర్షం ఉపశమనం కల్పించినా, సిద్ధాంతం, రామన్నపాలెం, దేవ, ఇలపర్రు గ్రామాల్లో వరి నాట్లు వేసిన చేలను వర్షం ముంచేసింది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వరి నాట్లు కుళ్లిపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకాలువలు, మురుగు కాలువలు వర్షపు నీటితో నిండిపోవడంతో వరి చేలల్లో నీరు నిలిచిపోయింది. సోమవారం సైతం వర్షం పడుతుండడంతో చేలల్లో నీరు తీయడం కష్టంగా మారింది.



గుడిపాడు వద్ద చెరువును తలపిస్తున్న వరి చేలు

అధ్యాపకుల సర్దుబాటు మేరకే టైం టేబుల్

నూజివీడు: ఈ విద్యాసంవత్సరం శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు సంబంధించిన పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీలోనే తరగతులు నిర్వహిస్తున్నందున అధ్యాపకుల సర్దుబాటు అనివార్యమైందని డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ సోమవారం తెలిపారు. ×టైం టేబుల్‌పై ట్రిపుల్ ఐటీలో రగడ₹ శీర్షికన ప్రత్యేక కథనాన్ని సాక్షి ప్రచురించిన సంగతి విదితమే. దీనికి వివరణనిస్తూ విద్యాసంస్థలో పనిచేసే ఏ అధికారి అయినా విధాన నిర్ణయాలను అనుసరిస్తారే తప్ప వ్యక్తిగత నిర్ణయాలకు ప్రాధాన్యతనివ్వరన్నారు. దీనిలో భాగంగానే తెలుగు శాఖలో తొమ్మిది మంది అధ్యాపకులుండగా అందరికి సమానమైన వర్క్ లోడు ఉండాలనే అభిప్రాయమే తప్ప ఎలాంటి వ్యక్తిగత దురుద్దేశాలకు, పక్షపాత ధోరణికి ఆస్కారం లేదని పేర్కొన్నారు. అకడమిక్ విషయాల్లో డీన్ యూనివర్సిటీ నిబంధనలు అనుసరించి పనిచేస్తారన్నారు. విద్యావసరాలను బట్టి పీయూసీకి చెప్పే వారిని బీటెక్, బీటెక్‌లో చెప్పే అధ్యాపకులను పీయూసీలో బోధన చేస్తుంటారని, ఈ క్రమంలోనే అధ్యాపకులకు, మెంటార్లకు సమాన ప్రాధాన్యం ఇచ్చే ఉద్దేశంతోనే టైంటేబుల్‌ను వేశారన్నారు.

నేడు పేరుపాలెం బీచ్‌కు నో పర్మిషన్

నరసాపురం రూరల్: సముద్రంలో అలల ఉధృతి పెరుగుతున్నందున మంగళవారం పేరుపాలెం బీచ్‌లోకి సందర్శకులను అనుమతించడం లేదని మొగల్తూరు ఎస్సై జి.వాసు ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణంలో మార్పుల వల్ల సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉందని, అందువల్ల ముందు జాగ్రత్తగా సందర్శకులకు అనుమతించడం లేదని చెప్పారు.

విద్యతో పాటు క్రీడలపై దృష్టిపెట్టాలి



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): రాష్ట్ర సబ్ జూనియర్ అండ్ జూనియర్స్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కలెక్టరు కె.వెట్రిసెల్వి, జాయింటు కలెక్టరు పి. ధాత్రిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని అన్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు క్రీడలతోనే సాధ్యమని యువత విద్యతోపాటు సమానంగా క్రీడల పట్ల మొగ్గు చూపాలని కోరారు. జాతీయ స్థాయిలో బాగా పతకాలు సాధించాలని, క్రీడాకారులకు ఎలాంటి సదుపాయాలు కావాలన్నా ప్రభుత్వ పరంగా అన్ని సమకూర్చుతామని కలెక్టరు కె.వెట్రిసెల్వి అన్నారు.

స్విమ్మింగ్‌లో అవార్డులు

ఈ నెల 19 నుంచి 20 జరిగిన రాష్ట్ర సబ్ జూనియర్ అండ్ జూనియర్స్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలలో ఏలూరు జిల్లా నుండి 20 మంది పాల్గొనగా అందులో ఏలూరు క్రీడా ప్రాధికార సంస్థ స్విమ్మింగ్ పూల్ నుంచి ఆరుగురు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. బలగ స్వామి నాయుడు 5 బంగారు పతకాలు సాధించి వ్యక్తిగత చాంపియన్ షిప్ అవార్డును, ఏపీ ఫాస్టెస్ట్ స్విమ్మర్‌గా నిలిచినట్లు అధికారులు తెలిపారు. ఎం.ధనుష్‌సాయి 2 బంగారు పతకాలు, 2 రజత పతకాలు, 1 కాంస్య పతకాలు, జర్జాన యశస్విని 2 బంగారు పతకాలు, ఉన్నమట్ల మోహన దీప్తి 2 కాంస్య పతకాలు, అడ్డాడ రిశ్వంత్, షేక్ హాకీల్ కాంస్య పతకాల్ని సాధించారు. బలగ స్వామి నాయుడు, మరుబరిక ధనుష్ సాయి జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు. జాతీయ జూనియర్ వాటర్ పోలో గేమ్‌కు అడ్డాడ రిశ్వంత్, షేక్ హాకీల్ ఎంపిక అయ్యారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



కొయ్యలగూడెం: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని అక్రమార్కుల పాలనలో అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయని వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని తన ప్రమేయం లేని వ్యవహారంలో తప్పుడు కేసులో ఇరుకునపెట్టడం కక్ష సాధింపు చర్య అన్నారు. ఎక్సైజ్ శాఖతో సంబంధంలేని ఎంపీని అరెస్టు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనంగా మారిందన్నారు. 2014–19 టీడీపీ పాలనలోనే మద్యం మాఫియా రాజ్యం నడిచిందన్నారు. ప్రివిలేజ్ ఫీ రద్దుతో రాష్ట్రానికి ప్రతి సంవత్సరం రూ.1300 కోట్లు నష్టం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 43,000 బెల్ట్ షాపులు రద్దు చేశామని, లిక్కర్ అవుట్‌లెట్లను 4,380 నుంచి 2,934కి తగ్గించామన్నారు. ఈ–పేమెంట్ విధానం ప్రవేశపెట్టి పారదర్శకత తీసుకువచ్చామని చెప్పారు. కాంపిటేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వైఎస్సార్‌సీపీ హయాంలో లిక్కర్ పాలసీ హేతుబద్ధంగా జరిగిందని కితాబు ఇచ్చిందన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తుల వెరిఫికేషన్ పూర్తి చేయాలి

ఏలూరు(మెట్రో): అగ్రిగోల్డ్‌కు సంబంధించి ప్రభుత్వం అటాచ్ చేసిన ఆస్తులు, భూములకు సంబంధించి ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర భూపరిపాలన శాఖ చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి సంబంధిత జిల్లాల జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. అగ్రిగోల్డ్ ఆస్తులకు సంబంధించి భూముల గుర్తింపు, ప్రభుత్వ విలువ, ప్రైవేట్ మార్కెట్ విలువ, మ్యుటేషన్, తదితర అంశాలపై రాష్ట్రంలోని వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, డీఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులకు సంబంధించి సేల్ డీడ్‌లను అనుసరించి సంబంధిత భూములను భౌతికంగా పరిశీలించి, ఆయా భూముల ప్రభుత్వ విలువలు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి, మార్కెట్ విలువను అధికారిక ఏజెన్సీ నుంచి పొంది, మ్యుటేషన్ పనులు పూర్తి చేయాలన్నారు.

పురుగుమందు కొడుతూ రైతు మృతి

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని గవరపేట గ్రామానికి చెందిన రైతు ఎం.వెంకట సత్యనారాయణ(38) చేలో పురుగుమందులు కొడుతూ మృతి చెందాడు. సోమవారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రైతు వెంకట సత్యనారాయణ శనివారం తన పొలంలో గడ్డి మందు కొట్టడానికి వెళ్లాడు. గడ్డి మందు కొడుతుండగా ఆ వాసన గుండెకు పట్టేసి ఊపిరాడలేదు. రైతు పరిస్థితి తెలుసుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రైతు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై బి.సురేంద్రకుమార్ తెలిపారు.

యాసిడ్ తాగి వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: అప్పులు తీర్చే పరిస్థితులు కానరాకపోవటంతో యాసిడ్ తాగి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వెంకటరావుపేట ప్రాంతానికి చెందిన వేముల శ్రీనివాస్ (54) భార్యతో కలిసి జీవిస్తున్నాడు. వీరికి ముగ్గురు సంతానం కాగా అందరికీ వివాహాలు చేశారు. ప్రస్తుతం శ్రీనివాస్ కొత్తపేట సమీపంలో కిరణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఫైనాన్స్ కంపెనీల నుంచి సుమారు రూ.15 లక్షల వరకూ అప్పులు చేశాడు. తిరిగి చెల్లించే పరిస్థితి లేకపోవటంతో సోమవారం ఉదయం ఇంట్లోనే యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు జీజీహెచ్‌కు తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించటంతో చికిత్స పొందుతూనే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గంగారత్నం మృతదేహం వద్ద విలపిస్తున్న కుమారుడు

పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లు మండలం లంకలకోడేరు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని భగ్గేశ్వరం గ్రామానికి చెందిన పి.గంగారత్నం (55) మరణించినట్లు పాలకొల్లు రూరల్ ఎస్సై బొంతు సురేంద్రకుమార్ తెలిపారు. గంగారత్నం తన కుమారుడితో కలిసి మోటార్ సైకిల్‌పై లంకలకోడేరు గ్రామంలోని పోస్టాఫీసుకు వెళ్లింది. అక్కడ పని చూసుకుని తిరిగి భగ్గేశ్వరం వెళ్తుండగా మధ్యలో వెనుక నుంచి లారీ ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈమెకు భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

లారీ ఢీకొని మరొకరు..

కాళ్ల : జక్కరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు కాళ్ళ పోలీసులు సోమవారం తెలిపారు. కాళ్ళ ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ల మండలం బొండాడపేట గ్రామ శివారు నేరేడుగరువు ప్రాంతానికి చెందిన బొర్రా శివయ్య(45) కూలి పని చేస్తాడు. సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో కూలి పని నిమిత్తం వెళ్తుండగా జక్కరం గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద భీమవరం వైపు నుంచి సీసలి వైపు వస్తున్న వాటర్ ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. దీంతో శివయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి



ప్రమాదంలో మృతి చెందిన అనిత, తీవ్రంగా గాయపడిన మోజెస్

ముసునూరు: వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లిన మహిళ, ఆస్పత్రికి చేరకుండానే అనంత లోకాలకు చేరిన సంఘటన మండలంలో జరిగింది. సోమవారం లోపూడి గ్రామానికి చెందిన తాణంకి రాంబాబు భార్య అనిత (30) తన చిన్న కుమారుడితోపాటు, సమీప బంధువు దిరిశనపు మోజెస్ బైక్‌పై రమణక్కపేట పీహెచ్‌సీకి వెళ్లారు. చెక్కపల్లి–రమణక్కపేట ప్రధాన రహదారిలో చెక్కపల్లి దాటిన తర్వాత లారీ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో అనిత అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె కుమారుడికి గాయాలయ్యాయి. బైక్ నడుపుతున్న యువకుడి ఎడమ చేయి దెబ్బతింది. వారిని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మోజెస్‌ను మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి, పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు టౌన్: జ్యూట్‌మిల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. మృతుడి వయసు 55 ఏళ్లు ఉంటుందని అంచనా. మృతుడు లేత నీలం రంగు టీషర్ట్, ముక్కుపొడుం రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆచూకీ తెలిస్తే ఏలూరు రైల్వే ఎస్ఐ పీ.సైమన్, ఫోన్ నెంబర్ 9989219559కు సమాచారం ఇవ్వాలని కోరారు.

క్లుప్తంగా

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తొలుత ర్యాలీగా ఎంఆర్‌ఓ కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రూపా శంకర్, కార్యదర్శి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో అన్ని రకాల ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యారంగం చట్టాలను అమలుచేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ హరిప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక డీఆర్ గోయెంకా ఉమన్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బోణం హరిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్థిక, భద్రత పరమైన నేరాలను సైబర్ నేరాలు అంటారని, పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఎవరిని సంప్రదించాలి, ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలి తదితర విషయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరంపాలెంలో ఆవులకు టీకాలు


వీరంపాలెంలో ఆవులకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం, బంగారుగూడెం గ్రామాల్లో సోమవారం ముద్ద వాపు వ్యాధి (లంపి స్కిన్ వైరస్) నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ టీవీ.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఆవులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవులు కలిగిన ప్రతి రైతు లంపి స్కిన్ వైరస్ ముందస్తు నివారణ టీకాలు వేయించాలన్నారు. తద్వారా వ్యాధి రాకుండా అరికట్టవచ్చన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. మంగళవారం రామన్నగూడెం గ్రామంలో టీకాలు వేయనున్నట్లు డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రాజేష్‌కు అభినందనలు


విద్యార్థి రాజేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో మండలంలోని మోదుగ గుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నరమామిడి భాస్కర వెంకట రాజేష్ ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థి రాజేష్‌ను సర్పంచ్ కట్టా సత్యవతి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

శ్రీకృష్ణపరమాత్మకు ముత్యాల హారతి


ముత్యాల హారతిలో పాల్గొన్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రోహిణి నక్షత్రం సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగధ్యాన మందిరంలో స్వామి వారికి మహిళలచే ముత్యాల హారతి అందజేశారు. యోగిని ఏకదశిగా పిలిచే అషాఢ బహళ ఏకాదశి సందర్భంగా మందిరంలో శ్రీకృష్ణ స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు మందిర నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

రీసర్వే చకచకా!


పట్టణంలో రీసర్వే చిత్రాలు



- ఆగస్టు రెండు డెడ్ లైన్
- పట్టణ రికార్డు ఆన్‌లైన్ చేయాల్సిందే

తాడేపల్లిగూడెం: వ్యవసాయ భూములు, నివాస గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాలు వీటన్నింటికి సంబంధించి సమగ్ర సమాచారం, కాగితం రూపంలో అధికారికంగా హక్కు పత్రాలుగా ఈ చేతికి అందుతున్నాయి. సుమారు వంద సంవత్సరాల తర్వాత రీ సర్వే రూపంలో జరిగిన క్షేత్రస్థాయి అధ్యయనం ద్వారా రీ సర్వే హక్కు పత్రాలు ఎవ్వరికి వారికి అందనున్నాయి. 2022లో రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా తాడేపల్లిగూడెంలో ప్రారంభమైన రీ సర్వే కార్యక్రమం ముగింపు దశకు చేరుకుంది. పట్టణ ఆస్తులు, వ్యవసాయ భూములు పూర్తి సమాచారం ఆన్‌లైన్ రూపంలో నిక్షిప్తం చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఆగస్టు రెండు నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఇది పూర్తైన తర్వాత రికార్డు ఆఫ్ రైట్, టైటిల్ డిస్ట్రిబ్యూషన్‌లు మాత్రం పెండింగ్‌లో ఉంటాయి. ప్రభుత్వ ఆదేశానుసారం పట్టణంలో రీ సర్వే పెండింగ్ ప్రక్రియ పూర్తి చేయడానికి మునిసిపల్, రెవెన్యూ అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. వ్యవసాయ భూములు, కొన్ని నివాస ప్రాంతాలకు సంబంధించి రీ సర్వే మిగిలి ఉంది. గతంలోనే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నా, సార్వత్రిక ఎన్నికల కారణంగా ప్రక్రియకు అవరోధం కలిగింది. ప్రస్తుతం ఈ ప్రక్రియ మళ్లీ పట్టాలెక్కింది.

ఇప్పటి వరకు రీ సర్వేలో చాలా వరకు వ్యవసాయ భూముల లెక్కలు తేల్చారు.

కడకట్ల -1873.89 ఎకరాలు
తాడేపల్లిగూడెం-1846.82 ఎకరాలు
యాగర్లపల్లి- 618.47 ఎకరాలు
తాళ్లముదునూరుపాడు -411.18 ఎకరాలు
జువ్వలపాలెం (దర్శిపర్రు రెవిన్యూ) 1150.32 ఎకరాలు మొత్తం 5900.68 ఎకరాలుగా తేల్చారు.

రీసర్వే పూర్తయ్యితే 75 కోట్లు

రీ సర్వే ప్రక్రియ పూర్తయ్యి ఆగస్టు రెండు నాటికి ఆన్‌లైన్ పూర్తి చేస్తే గూడెం మునిసిపాలిటీకి 75 కోట్ల రూపాయలు నిధులు రానున్నాయి. దఫదఫాలుగా ఈ నిధులు పట్టణంలో అభివృద్ధి పనుల కోసం విడుదలవుతాయి. ఈ నేపథ్యంలో రీ సర్వేను ఆగస్టు నాటికి పూర్తి చేసేందుకు మునిసిపల్, రెవెన్యూ అధికారులు శ్రమిస్తున్నారు.

రీ సర్వే ఇలా జరిగింది

2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 1,03,906 ఉంది. 27వేల 192 గృహాలున్నాయి. 26,807 అసెస్‌మెంట్లు ఉన్నాయి. 23.86 చదరపు కిలోమీటర్ల మేర పట్టణం వ్యాపించి ఉంది. 13 సర్వే వార్డులు, 129 బ్లాకులు, ఒక రెవెన్యూ గ్రామంగా విభజించబడి ఉన్న పురపాలక సంఘంలో ఇదే పద్ధతిలో బృందాలను ఏర్పాటు చేసి రీసర్వే చేశారు. మునిసిపాలిటీలో ఉన్న 35 వార్డులకు 35 వార్డు స్థాయి బృందాలు, 14 మంది సూపర్‌వైజర్లను నియమించారు. రీ సర్వే కోసం 70 గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు ఏర్పాటు చేశారు. రీ సర్వే ప్రక్రియలో భాగంగా రోవర్, డ్రోన్ సర్వే ద్వారా సంగ్రహించిన సమాచారాన్ని నిడదవోలు సమీపంలోని సమిశ్రగూడెంలోని బేస్‌స్టేషన్‌కు అనుసంధానం చేసి, నిక్షిప్తం చేశారు. 2022 మార్చిలో డ్రోన్ సర్వే చేసి, గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను 2024లో పూర్తి చేశారు. రీ సర్వేకు గాను 30,945 నోటీసులు అందజేశారు. వీటిపై వచ్చిన 265 అభ్యంతరాలు రాగా, వాటిని పరిష్కరించారు. వ్యవసాయ భూములకు సంబంధించి , నివాసగృహాలకు గాను కొంత రీ సర్వే మిగిలి ఉంది. దీని కోసం తిరిగి కసరత్తు మళ్లీ మొదలయ్యింది. ఆర్ఓఆర్, టైటిల్స్ డిస్ట్రిబ్యూషన్ పెండింగ్‌లో ఉన్నాయి.

మండల అభివృద్ధికి అందరూ కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, తదితరులు

ఇరగవరం: మండల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు చెప్పారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మంగతాయారు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఎంపీటీసీలు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రూ.50లక్షలతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్ రావడంతో అప్పటి నుంచి ఆ పనులు ఆగిపోయాయని, మళ్లీ ఆపనులు మంజూరుకు అవకాశం కల్పించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈవిషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం జెడ్పీటీసీ పంపన అంజిబాబు మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తణుకులో విజిలెన్స్ తనిఖీలు


తణుకులో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ ఎస్సై సీతారాం, అధికారులు

తణుకు అర్బన్: తణుకులో క్యాటరింగ్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పి.మహేష్ ఆదేశాల మేరకు తణుకులోని గణేష్ క్యాటరింగ్, రుచి క్యాటరింగ్ దుకాణాలపై సోమవారం దాడులు చేసి తొమ్మిది గృహ అవసరాలకు (సబ్సిడీ సిలిండర్లు) వినియోగించే గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని సదరు నిర్వాహకులపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్సై కె.సీతారాం తెలిపారు. క్యాటరింగ్ దుకాణాల యజమానులు సాహు సత్యనారాయణ, చట్రాతి సీతారామారావులు తమ క్యాటరింగ్ దుకాణాల్లో వాణిజ్యపరమైన గ్యాస్ సిలిండర్ల వినియోగానికి బదులుగా గృహవసర సిలిండర్లను వినియోగించడాన్ని తమ దాడుల్లో బయటపడినట్లు చెప్పారు. ఈ దాడుల్లో రెండు దుకాణాల్లోను రూ. 24,541 విలువైన తొమ్మిది గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. విజిలెన్స్ తహసీల్దార్ బి. కన్యాకుమారి, తణుకు డిప్యూటీ తహసీల్దార్ ఎన్.శ్రీదేవి, పట్టణ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం


తణుకులో నిరసన తెలుపుతున్న పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్ : ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమమని సోమవారం తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులు తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకే ఈ అక్రమ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అరాచకాలను డైవర్షన్ చేసేందుకు ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు ఇవ్వకపోగా సుపరిపాలన తొలిఅడుగు అంటూ ప్రజల్లోకి కూటమి నాయకులు వెళ్తున్నారని అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్లినప్పుడు మెజారిటీ ప్రజానీకం తాము మోసపోయామని, ఇస్తానన్న పథకాలేవీ ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమమని పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, నాయకులు ఫణీంద్రకుమార్ వీరమల్లు, బిరుదుకోట చింతన్న, మారిశెట్టి శివశంకర్, జల్లూరి జగదీష్, మెహర్ అన్సారీ, నత్తా కృష్ణవేణి, పైడి సాయి సూర్య, కంచుమర్తి విశ్వేశ్వరరావు, పైబోయిన ఏసుబాబు, వై.రామకృష్ణ, గారపాటి సత్యనారాయణ, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టు రాజకీయ కుట్రే


పోతంశెట్టి లక్ష్మి

పెంటపాడు: కూటమి పెద్దలు సృష్టించిన లిక్కర్ స్కామ్ కేసులో వైఎస్సార్ సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఇరికించి అరెస్టు చేయడం ముమ్మాటికీ రాజకీయ కుట్రేనని ఆర్‌సీడీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతంశెట్టి లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె పెంటపాడులో తమ నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల మనసులో గూడు కట్టుకున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీని ఏవిధంగానా వారి మనస్సుల్లోనుంచి దూరం చేయాలి అనే దురాలోచనలో భాగంగా అక్రమ అరెస్టులు చేస్తున్నారని అన్నారు. ప్రజలను, వైఎసార్ సీపీ శ్రేణులను భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు, అక్రమ అరెస్టులు పెచ్చుమీరాయన్నారు. దానిలో భాగంగానే లేని లిక్కర్ స్కామ్ లో పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మిథున్‌రెడ్డిని అరెస్టుచేశారన్నారు. చంద్రబాబు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయించారన్నారు. ఎన్ని అక్రమ కేసులుపెట్టినా, రాజకీయంగా ఎంత ఇబ్బంది పెట్టినా తమ నాయకుడు మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకువస్తారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

కూటమి మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి


మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు శేషగిరి

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేని దుస్థితిలో ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహాన్ని చవిచూస్తుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి అన్నారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ పట్టణ నాయకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తణుకు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషిచేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. నిరంతరం ప్రజల కోసం శ్రమించిన కారుమూరి ఆదేశాలతో పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాల్సిన సమయం వచ్చిందన్నారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకపోవడంతో పాటు రైతులకు ధాన్యం డబ్బులు కూడా వేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వంపై విపరీతమైన వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని తెలుసుకున్నారని, ప్రజలకు కూటమి మోసాన్ని మరింతగా చేరువచేసేందుకు ఆయా వార్డుల్లో నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఐదేళ్ల పాటు ప్రజల్లో ఉన్న మనకు ప్రజల నుంచి పూర్తి స్థాయి ఆదరణ ఉందని, దానిని సద్వినియోగపరచుకుని ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, పబ్లిసిటీవింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, నియోజవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ నత్తా కృష్ణవేణి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, షేక్ ఫహీమా, గారపాటి సత్యనారాయణ, గెద్దాడ శ్రీకాంత్, కొఠారు రామాంజనేయులు, షేక్ బాజీ, షేక్ జిలానీ పాల్గొన్నారు.

మూడేళ్ల చిన్నారి వైద్యానికి సీఎంఆర్ఎఫ్ సాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర గ్రామానికి చెందిన మిద్దె మణికంఠ కిషోర్ అత్యవసర పరిస్థితుల్లో విజయవాడ ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. చిన్నారి పరిస్థితిని గ్రామ సర్పంచ్ పిల్లా రాంబాబు, ఉప సర్పంచ్ కాసాని రాంబాబులు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన హుటాహుటీన వైద్య ఆరోగ్య శాఖ ద్వారా రూ.3.5లక్షలు ఎల్ఓసీని అందజేశారు. దీనికి సంబంధించిన మంజూరు పత్రాన్ని సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద సర్పంచ్ పిల్లా రాంబాబు, ఉప సర్పంచ్ కాసాని రాంబాబులకు ఎమ్మెల్యే శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీఐఎం కళాశాలకు మౌలిక వసతులు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అప్పలస్వామి

తణుకు అర్బన్: తణుకు ఎస్సీఐఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు మెరుగుపరచాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి తణుకు నియోజవర్గ అధ్యక్షుడు గంటా పవన్ డిమాండ్ చేశారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కళాశాలకు ఏళ్ల తరబడి సరైన క్రీడా ప్రాంగణం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం ఉన్న క్రీడా ప్రాంగణంలో మొక్కలు పెరిగిపోయి నిరుపయోగంగా ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ కళాశాలకు ఉన్న క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేయించి క్రీడలకు అనుకూలమైన వాతావరణం కలుగజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల ఏడుగురితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ నాయకులు జె.కళ్యాణ్ అధ్యతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా బి మురళి, కార్యదర్శిగా రామ్ చరణ్ తదితరులను నియమించారు. నాయకులు వి జయరాజ్, ఏ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ కళాకేంద్రాన్ని పరిరక్షించండి



మునిసిపల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రం, ఆఫీసర్స్‌క్లబ్‌లను పరిరక్షించాలని నియోజకవర్గ కళాకారులు ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ నాటక పరిషత్తు సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, ఐజేయూ నాయకులు సోమసుందర్ మాట్లాడుతూ బీవీఆర్ కళాకేంద్రం దశాబ్దాలుగా తాడేపల్లిగూడెం పట్టణంలో కళలను ప్రోత్సహిస్తుందని, పేద కళాకారులను ఆదుకోవడానికి దోహదపడిందని చెప్పారు. కళాకేంద్రంలో ఆరు దశాబ్ధాలుగా కళలు, నాటికలు, సన్మాన వేడుకలకు, రాజకీయ సభలకు, మూడు వేలకు పైగా ఎన్నో మంచి కార్యక్రమాలకు నిలయంగా బీవీఆర్ కళా నిలిచిందని, ఎంతో మంది హృదయాల్లో చెరగని చిరునామగా ఎన్నో మధుర స్మృతులను అందజేసిందని పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయం నుంచి మునిసిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. కమీషనర్ యేసుబాబుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పా రు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కోసూరి వీర్రాజు, కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులు, సీపీఐ నాయకులు మండల నాగేశ్వరరావు, బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్.ఎస్.ప్రసాద్, కళాకారులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు కాదేదీ అనర్హం

- రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు
- ఆక్రమణలతో ప్రయాణికులకు తప్పని తిప్పలు
- తొలగించాలని కోరుతున్న వాహన చోదకులు


ఇరగవరం-ఆలమూరు ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన భవనాలు


ఇరగవరం శ్మశానవాటిక దగ్గరలో నిర్మించిన ఇల్లు


ఇరగవరం-ఆలమూరు ఆర్ అండ్ బి రోడ్డు వద్ద ఆక్రమణలకు ఇచ్చిన విద్యుత్ సర్వీసులు

ఇరగవరం: ఆక్రమణలకు రహదారి, బడి గుడి, శ్మశానం ఇలా కాదేదీ అనర్హం అన్న చందంగా మారింది ఇరగవరంలోని ఆక్రమణదారుల తీరు. మండల కేంద్రమైన ఇరగవరంలో ఇరగవరం నుంచి ఆలమూరు వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా అక్రమణలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. వాటిని అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో అక్రమణదారుల దూకుడుకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. ఇరగవరం మీదుగా ఆలమూరు, నరసాపురం, పాలకొల్లు, పెనుగొండ, భీమవరం, ఆచంట వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి దీనికి తోడు మండల ప్రధాన కేంద్రం దీంతో కొన్ని సంవత్సరాలుగా గత కొన్నేళ్లుగా అక్రమణల పరంపర కొనసాగుతుంది. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇది మరింత ఎక్కువగా పెరుగుతుంది. ముందుగా రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో సిమెంట్ స్తంభాలతో రేకుల షెడ్ వేయడం, తరువాత కొంత కాలానికి శాశ్వత ప్రాతిపదికన బిల్డింగులు నిర్మించడం చేస్తున్నారు. దీనిని రెవెన్యూ, పంచాయతీ, ఆర్అండ్‌బీ, ఎలక్ట్రికల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇరగవరం పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా, శ్మశాన వాటిక దగ్గర కొత్తగా రేకుల షెడ్లు నిర్మించారు. వాటికి విద్యుత్ అధికారులు సర్వీసు కనెక్షన్లు ఇచ్చారు. అక్కడ వాటర్ సర్వీసింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నారు. ఇలా అక్రమించుకుంటూ పోతే చివరికి శ్మశానం కూడా మిగలదని ఈ అక్రమణలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల ఆదేశాలపై విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తాం



విద్యుత్ సర్వీసులు అనేవి ఇచ్చేటప్పుడు అవి కొత్తవి కావొచ్చు, పాతవి కావొచ్చు పంచాయతీ ఎన్ఓసీ, వాళ్ల దగ్గర ఉన్న ఇంటి పట్టాల ఆధారంగా విద్యుత్ సర్వీసులు ఇస్తాం. ఒక్కోసారి ఇండిమేటి బాండ్లు పెట్టుకొని వారికి విద్యుత్ సర్వీసులు ఇస్తాం. ఈ ఇండిమేటి బాండ్ల మీద విద్యుత్ సర్వీసు ఇచ్చిన స్థలం ప్రభుత్వం వారిదని వాటిని తొలగించాలని సంబంధిత అధికారుల దగ్గర నుంచి ఆదేశాలు వచ్చినట్లయితే ఆ వినియోగదారుల వద్ద నుంచి ఆ విద్యుత్ సర్వీసును వెంటనే నిలిపివేస్తాం. అలా కాకుండా అక్రమంగా విద్యుత్ సర్వీసులు పొందినట్టితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

– కె.రవిప్రసాద్, ఏఈ ఎలక్ట్రికల్, ఇరగవరం

ఆక్రమణలు మా దృష్టికి రాలేదు

అక్రమణలు అనేవి నా దృష్టికి రాలేదు అధికారులను అడిగి వివరాలు తీసుకొని చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ప్రభుత్వ స్థలాలు, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పీడబ్ల్యూడీ స్థలాలు అక్రమించుకుంటే వారిపై చర్యలు తీసుకుంటాం. అయితే తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఈ తంతు జరుగుతున్నా మా దృష్టికి రాలేదని తహసీల్దార్ చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.

– ఎం.సుందరరాజు, మండల తహసీల్దార్, ఇరగవరం

ఆషాఢం అమ్మవారి దర్శనాలకు ప్రత్యేక బస్సుల ఏర్పాటు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో నుంచి అషాఢ మాసంలో అమ్మవారి దర్శనాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) సుధారాణి వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ అషాఢ మాసంలో అమావాస్య రోజు ఈనెల 24వ తేదీ గురువారం రోజున వివిధ జిల్లాలోని దేవి దర్శనాలు పవిత్రమైనవి, అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన రోజు కావడం వల్ల ఆ రోజున దర్శనం చేసుకుంటే పుణ్యం లభిస్తుందని చెప్పారు. ఒక రోజు యాత్రలో చింతలూరు, మట్లపాలెం, కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం, కడియపులంక తదితర ప్రాంతాలలోని అమ్మవార్ల దర్శనం చేయిస్తామని చెప్పారు. టికెట్ ఖరీదు కేవలం రూ.500 అన్నారు. గూడెం బస్టాండ్ చేసిన ఉదయం 4 గంటలకు బస్సులు తరలివెళ్తాయని తిరిగి సాయంత్రం డిపోకు చేరుకుంటాయని తెలిపారు.

శివ శ్రీ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం


ట్రస్ట్ వారిచే కంప్యూటర్లు, టీవీ, ఫోన్‌లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శివ శ్రీ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ప్రథమశ్రేణి గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు కొనియాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం గ్రంథాలయానికి రెండు కంప్యూటర్లు, స్మార్ట్ టీవీ, స్మార్ట్ ఫోన్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ డి.సత్యనారాయణ, చదవరులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుడు రంగంనాయుడికి సత్కారం

కాళ్ల: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా జిల్లా ఉత్తమ వైద్యాధికారి అవార్డును అందుకున్న కాళ్ల పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సీహెచ్. రంగంనాయుడును సోమవారం స్థానిక వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సత్కరించారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ రంగంనాయుడు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.ఎస్.సునీల్, డా.డి.సునీత, డా.టి.భావన, సీహెచ్ఓ ఎస్.నాగమణి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.